# అడివి పావురేను

వాళ్ళ కొట్టం ముందుండే యాప సెట్టు మీంద పంగల్లో[1] పావురేన్ల[2] కోసం రెండు మూడు కడవలు గట్నాడు సంటోడు. రాత్రిళ్ళు పావురేన్లు కడవల్లో ఉడిగినాంక, కడవల మూతులకు డబ్బారేకు మూతలు కట్తాడు. రేక్కు రొండు వల్లలా బొక్కలు గొట్టి, బొక్కల గుండా నులకతాడు దూర్చి కట్టుండాది. ఆ తాడ్తో కడవల మూతులకో, ల్యాకపోతే మానికొమ్మలకో కడ్తాడు. అట్ట కట్టకపోతేగినా పిల్లి ఎక్కిపోయి పావురేన్లను తింటాదని బయం.

అన్నీ గల్చి ఆడ మూడు జతల పావురేన్లుంటే అందులో బూజదాని పెంటిని ఆ మద్దెన దేగ్గొట్టె. సంటోడు పండ్లు తోంకుంటా సూస్తానే వుండాడు, బూజదీ దాన్జతదీ సెట్టుమీన్నుంచీ కల్లాల్దిక్కు ఎగిర్నాయో లేదో, యాడున్నిందో దేగమల్ల సాట్నుంచీ సర్రునొచ్చి అడ్డాన్ని తన్నె. అదే పట్న అది నెత్తర కక్కుతా బాట్లో పడిపాయె. పరిగెత్తా పోయి సేతిలోకి తీసుకుంటే, సేతిలోనే పానం యిడ్సె. సచ్చిందాన్ని కోసుకోని సంగట్లో నంజుకోని తిందామని సంటోన్నాయినంటే, వాడు వల్లగాదంటే కాదనె. వాళ్ళమ్మ గూడా 'పిల్లోడు సాక్కున్న పావురేన్ను తిందామంటావేంది, నువు మనిసివా కాదా?" అని తిట్టె. 'కోన్ని తింటావుండాం గదా' అని ఆ మనిషి రోంత మలగాయిచ్చినాడు గానీ "సాల్లే సంబడం" అని ఆమె గట్టిగా గదమాయిచ్చి నోరుమూయిచ్చె. పావురేన్లను సూసుకుంటా పనికిపోడం ఎగ్గొడ్తా వుండాడని రోజూ అర్సే అమ్మ ఇప్పుడు కొడుకు దిక్కే మాట్లాడె.

మొట్టమొదట పావురేన్లను సాకడానికి ఆమె వొప్పుకోలా. 'దయ్యాలాల మూల్గుతా ఏంది దరిద్రెం' అని తిట్టింది. పావురేన్లను పెంచినందుకే రాందాసు జైల్లో పన్నాడని, పురానం సదివే ముద్రెడ్డి అన్నాడంట. దాన్తో 'పాపం గొట్తాదబ్బీ, వొద్దు' అనేది. సంటోడు సెవిన బెట్లా. అయిదు రూపాయిలిచ్చి యాడిగె ఎంగటి దగ్గిర్నించి ఒక జతను కొనుక్కోని వచ్చి, సెట్టు మీద కడవలు గట్నాడు. ఆ జతలో మొగది సొబ్జా, ఆడ్ది పూల్ది. అయి రొండూ తొక్కిళ్ళు పన్నాక, ముక్కుల్తో యాడుండే పుల్లా పుడకా తీసకపోయి, కడవలో పెట్టుకోడం, పూల్ది గుడ్లు పెట్నాక, గుడ్ల మీంద రొండూ ఒకటి మార్చి ఒకటి కూచ్చుంటా రాడం ...... అంతా ఆమె సూస్తానే వుంది.

"సంటోడా, మొగది గూడా గుడ్ల మీంద కూచ్చుంటా వుండాదిరా" అని సెప్పేది. "పావురేన్లే మంచియి, మంచులకన్నా" అని సంటోన్నాయిన వున్నెప్పుడు అనేది. సంటోడు పుట్నెప్పుడు అయప్ప దేశాలంబడి పోయినాడు. అందుకు ఆమె అట్ట ఎత్తి పొడ్సేది. ఆ గుడ్లకే యీ బూజదీ, దేగ్గొడ్తే సచ్చిపోయిన గేమ్యాల్దీ పుట్టింది. యింగొక జత యాన్నుంచీ వొచ్చిందో, యెవురు సాకుతాంటే యెందుకు బెదిరివొచ్చినాయో తెల్దు, యీటితో కల్చి గూటికాడికొచ్చినాయి. రొండు మూడ్రోజులున్నా పోకపోతే, ఆ జతకింగో కడవ కట్నాడు సంటోడు. ఈ జతలో మొగది నల్లది, నెత్తి మీద కొప్పుండాది. ఆడ్ది మల్లెపువ్వాల తె....ల్లది.

---

1) కొమ్మల్లో 2) పావురాలు

బూజది ఇప్పటికి యెన్నో పందాలు గెల్చింది. పందెమంటే, రొండు పావురేన్లనూ పెన్న కవతలుండే వూళ్ళోకి తీసకపోయి యిడ్సిపెడ్తారు. అయి గూటికి సేర్తానే, అద్దుకాడికి దేన్ని ముందు పట్టుకొస్తే అది గెల్చినట్టు. బూజదయితే, గేమ్యాలదాన్ని పట్టుకోని సూపిచ్చి, 'అవ్, అవ్' అని అర్సుతే యాడగావాల్నంటే అన్నే వాల్తాది. అందువల్ల పందాల్లో యెప్పుడూ అది వోడేది కాదు. అట్టాటిది యిప్పుడు పెంటిది పోయి వొంటిది అయింది. దాన్ని తల్చుకొంటా 'గూ.... గూ' అంటా వుంటాది. వూర పావురేన్నూ, అడివి పావురేన్నూ జత గలిపితే యిడ్సనే యిడ్సవు. దేన్ని పట్టుకొన్నా ఇంగొకటి ఎనకంబడీ వొస్తా వుంటాదని, ఎంగటి సెప్పినాడు. వూరి ముందరి సేలల్లో యెర్రమిట్ట కాడి పాడుబన్న బాయిలో ఎన్నో అడివి పావురేండ్లుండాయి.

యెర్రమిట్ట పక్క సేనికి కాయలేర్నుబోయిన సంటోడు ఆ బాయిలోకి దిగినాడు. బెమ్మాండమైన బాయి అది. దాంట్లో దయ్యాలుండాయనీ, కనపడిందని కూడా సెప్తా వుంటారు. మాడి మిద్దోళ్ళ కోళ్ళు[2], సిన్నెన్నుగారి మాలచ్చమ్మా దాంట్లో దూకే సచ్చిపోయింది. బాయి గోడంబడే దిగుతావుంటే వాని కాళ్ళూ సేతులూ వొనికినాయి. అట్టనే ధైర్నం సేసుకోని దిగుతాంటే సనసన్న రాళ్ళు జారి నీళ్ళలో పడి సప్పుడయ్యేతలికి, బొక్కల్లో వుండే పావురేండ్లన్నీ బయటకురికినాయి. ఒక్కటి ఎందుకనో రాలా. దాన్ని పట్టుకోని తెచ్చినాడు. గూడు మరిగే దాంకా అని దాన్రెక్కల కుండే పెద్ద యీకెలన్నిట్నీ పెరికినాడు. అది రొండ్రోజులు గింజలే తిన్లా. మల్ల, మెల్లమెల్లంగా తినబట్టిగానీ, మిగతా పావురేన్లతో కల్చకుండా దూరంగా వుంటావొచ్చె. ఏదన్నా దగ్గిరికొచ్చినా, ముక్కుతో పుటిక్కున పొడ్సి, రెక్కతో టప్పున కొడ్తే అయి బయపడి పక్కకు పోయేవి. అది మొగదో, ఆడ్దో తెల్సుకుందామని, బూజదాన్నీ దాన్నీ ఒక కడవలో బెడ్తే, అది కొరికి రెక్కల్తో కొట్టేతప్పటికి పందాలు గెల్చిన బూజది గూడా బయపడిపోయి, అంచుకే రాకపాయె. రెక్కలకు పెరిగిన యీకెల్తావులో మల్లా మొల్చుతా, రొంత కల్లీలు[3] బయటి కొచ్చిన కాన్నుంచీ, ఎగరబోయేదీ, ఎగర్లాక కిందబడేదీ ! పట్టుకొని సూస్తే, కల్లీలు సితికిపోయి రెక్కలు నెత్తరతో తడ్సిపోయి వుండేటియి. కిందబన్నప్పుడు కుక్కలు ఎత్తకబోతాయేమోని బయమేసేది. అంతగా పానానికి తెగిచ్చి అది ఎందుకు పోవాలనుకుంటాందో తెల్దు.

ఎట్టయితేనేం అది రెక్కలు సరిగా రాన్దే సంటోడు సూస్తా వుండగానే, అక్కడక్కడా వాల్తా వాల్తానే దాన్తావుకు పాయె. పెద్ద దాంట్లను తెచ్చినా వుండవనీ, గుడ్లను తెచ్చి మన పావురేన్ల కింద బెడ్తే, అయి పిల్లలై యీన్నే పెరిగి యీన్నే వుంటాయనీ, ఎంగటి యింగో వుపాయం సెప్పినాడు. ఎర్రమిట్ట బాయి కాడికి యిప్పుడదే పనిగా బోయినాడు సంటోడు. ఎట్టకనుక్కున్నాయో యేమో. మల్లా పావురేన్లన్నీ ఎగిరిపాయె. అన్ని బొక్కల్లోనూ ఎతికితే ఒకసాట రెండు గుడ్లు దొరికినాయి. యాన్నుంచో వచ్చిన జత అప్పుడు గుడ్లమీదుండాయి. ఆ గుడ్లను తీసి యీట్ని ఆడ పెట్నాడు.

మూడు వారాలకల్లా రొండు గుడ్లల్లో ఒకటి మురుగుడ్డు[4] పడిపోతే, ఇంగొకటి పిల్లాయె. ఒక పిల్లయిందాన రొండు పెద్దయీ గింజలు పెట్టేతలికి అది బెరీన పెద్దదయిపాయె. సాకుదు పావురేండ్లాల

2) కోడలు 3) మొలుచుకొస్తున్న ఈకలు 4) పిల్ల కాకుండా గ్రుడ్డు చెడడం

అడివి దాంట్లలో రకాలుండవు.అన్నీ ఒకే రకంగా వుంటాయి. అన్నీ సొబ్జాలే. సిత్రమేందంటే అది సిన్నపిల్లగా వున్నెప్పుడు, అమ్మా నాయిన్దగ్గర మామూలుగానే వుండేది. రోంతరోంత పెద్దదయ్యే కొద్దీ ఎడంగా పోబట్టె. ఆ పెద్దయీ అట్టనే వుండె. రెక్కలొచ్చి కొత్తగా ఎగిరేతప్పుడు గూడా వాట్తో కల్చకుండా కడగా ఎగుర్తా వుండేది. ఎప్పుడూ దిక్కులు సూస్తా వుండేది. మూలిగే పాయం వొచ్చినా, మూల్గకుండా మూగిదానాలుండేది. యిట్టా వుంటానె ఒకనాడు ఎగిరిపోయి యింగ తిరిగిరాలా.

సంటోడికి బోకోపమొచ్చింది[5]. మల్లా దాన్ని పట్టుకొచ్చి గూడు మరిగే దాంకా రెక్కలు పెరుకుతానే వుండాలనిపిచ్చింది. అయినా దానికి యెర్రమిట్ట బాయి తెల్దుగదా ఆడికి ఎట్ల పోయుంటాదని అనుమానమొచ్చింది. 'సూదాల తాలు' అని పోయినాడు. పోతే, బాయి గద్ద నుండే సెట్టు మీందనే అగుపడింది. ఆ కొమ్మకు ఈ కొమ్మకు ఎగుర్తా, 'గుడుగుడుక్కూ' అని యింగోదాన్ని తరుముతాంది. అది తన సొంత తావైనట్టూ, తన వాళ్ళను కల్చుకొన్నట్టూ సంబరంగా వుండాది !

ఆ 'మూగిది' యిప్పుడట్టా మూల్గుతా వుశారుగా వుండేది సూసేతలికి, సంటోడికి కోపం పోయి........ నగొచ్చింది.

5) చాలా కోపం వచ్చింది